# నక్కలు

పొద్దు బారెడెక్కింది.

ఆడవాళ్లంతా వంట పనులు చూసుకుంటున్నారు. వరి అన్నం మాటలేదు. సజ్జ – జొన్న సంకటే! మగవాళ్లంత పని పాటలకు వెళ్లడానికి సిద్ధమౌతున్నారు. ఈలోపు 'డం డం' డప్పు మోగింది. "ఇందుమూలముగా తెలియజేయటం ఏమనగా, శిస్తు కట్టవల్సిన వాళ్ళంత రకంతో, లెవి కొలవాల్సినవాళ్లు ధాన్యంతో కచ్చీరు ముందుకు రావలసినదిగా సర్కారు ఆజ్ఞ" అంటూ వీధులు తిరుగుతున్నాడు. ఎట్టి మాదిగ. ఆతని వెంట బాల బాలికలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నారు. ఒకడు తాటి మట్టను బండిలాగా గుంజుతున్నాడు. మరొకడు తాటి బుర్రను డప్పులాగ కొడుతున్నాడు. అమ్మాయిల నెత్తికి నూనె లేక దువ్వుకోక చింపిరి చింపిరి తలలతో తిరుగుతువున్నారు. అందరు చాకిరి కులాల వాళ్ల పిల్లలే వాళ్లకు సరియైన తిండిలేదు, ఒంటినిండా బట్టలు లేవు.

'డం డం' డప్పు మోగుతూనే వుంది.

కచ్చీర్ ముందు చావట్లోని వేపచెట్టు కిందికి జనం చేరుతువున్నారు. సర్కారు మనుషులు వచ్చి పుల్లారెడ్డి ఇంట్లో కల్లు తాగుతూ, చికెన్‌తో పరోటాలు తింటూ వున్నారు. కల్లును గౌండ్లవాళ్ళు పంపగ, కోళ్ళు కూలి కులాల వాళ్లవి, మిగతా దినుసులు, కోమట్లు పంపారు. తిండి తాగుడు అయ్యే సరికి అమ్మటాల్లయింది. ఈ లోపు సేక్‌సింది, ఎట్టి జనాన్ని తీసుకొచ్చి చావట్లో నిలుచోబెట్టాడు. కొందరు మాలి పటేలుకు రకం కడుతువున్నారు. మరికొందరు లేవి గింజలు కొలుస్తున్నారు. రకం కట్టలేని వాళ్లు కొందరి మేకలను, బర్రెలను కొట్టుకొచ్చి కట్టేస్తున్నారు. గిర్‌దావర్ కళ్ళు ఎర్రగ వున్నాయి. పుల్లతో పళ్లల్లో ఇరికిన మాంసాన్ని బయటికి తీసి మళ్ళీ తింటున్నాడు. పక్క కుర్చీలో కూర్చున్న పుల్లారెడ్డితో జోకులేస్తూ మాట్లాడుతున్నాడు. పుల్లారెడ్డి ఆవూరి పోలీసు పటేలు. పైవాళ్ల మెప్పుకోసం కిందివాళ్లను హింసిస్తూ వుంటాడు. పొద్దు నెత్తిమీదికి వచ్చింది. ఇవ్వగలిగిన

వాళ్లు ఇచ్చారు. ఇవ్వలేని వాళ్లు గడువు కోరుకుంటున్నారని మాలి పటేలు, గిర్దావర్ సాహెబు గార్కి కొన్ని పేర్లున్న కాగితాన్ని అందియబోగ, "నీవే పేర్లు చదువు" అన్నాడు.నాలుకతో పళ్లను అద్దుతూ. ఆయన మీసాలు నున్నగ కొరిగించి గడ్డాన్ని ఓ సైజ్‌కు వొదిలేస్తాడు. మాలి పటేలు పక్కకు జరిగి -

" చాకలి రాజిగ వల్లు చెంద్రిగ, మంగలి బుచ్చిగ వల్లు రామ, మాదిగ పెంటిగ వల్లులింగ, మాల బుచ్చిగ వల్లు ఎంక " అని చదువుతువుంటే ఒక్కొక్కరు వచ్చి గిర్దావర్ ముందు నిలుచున్నారు. " ఎంది బై, రకం కట్టర " గిర్దావర్ కేకలు

తల వంచుకుని నిలుచున్నారె కాని ఎవరు మాట్లాడలేదు.

" అబే మీ అయ్య జాగీరులార ఉట్టిగనే పండించుకుంటందుకు. పంటతీసుకొని రకం కట్టరు లేవి కొలువరు" అని కోపంగా అడిగాడు.

" ఈ ఏడు వానలులేక పంటలు పండలేదు దొర" అన్నాడు చాకలి రాజయ్య చేతులు జోడిస్తు.

" అచ్చా నీ వొక్కని భూమిల్నే పడతలేదా వాన, మరి గాల్లంత ఎట్ల దాన్యం కొలిసింద్రు, రకం కట్టింద్రు వానపడితె ఊరిమీద ఆంత పడతదిర, ఒక చెలకలపడి ఇంకొకని చెలుకల పడకుంట వుండదిర " అన్నాడు గిర్‌దావర్.

" పంటలు పండితె రకం ఎందుకు కట్టందొర " అన్నాడు మాదిగ పెంటయ్య.

" మల్ల అదె మాటర, దొరవారు వీన్ని వంగబెట్టి బండ పెట్లియ్యి " అంటు పులారెడ్డి వైపు చూశాడు. వెట్టివాళ్లు వెళ్లి పెంటయ్యను వంగ బెట్టారు. అది చూసిన గిర్దావర్ అందర్ని అట్టనె వంగబెట్టుండ్రి " అని హుకుం జారీచేశాడు. ఇదే అదును అనుకుని పుల్లారెడ్డి పాత పగలను గుర్తుకు తెచ్చుకుని రకం కట్టని వాళ్లందరిని వరసగ వంగబెట్టి వీపు మీదబండలు తెప్పించి వుంచారు.

చావడి పక్కన్నె పుల్లారెడ్డి గడి ఆ గడిలోపల కోళ్లగూటి వేయడానికి రాళ్లు, దెబ్బలు కొట్టడానికి కొరడాలు సిద్దంగ వున్నాయి. అంతేకాదు చాకిరి కులాలలో ఏ స్త్రీ అయినా అక్రమ సంబంధం వొడికడితె ఆమెకు లాగు తొడిగించి కాళ్లగుత్తుల దగ్గర బిగ్గర కట్టి లోపల తొండను వదిలి నడుం దగ్గర కడతారు. అంతటి భయంకర శిక్షలు విధించి చూస్తూ వుండే రాక్షస జాతి సంతతివాళ్లది.

పొద్దు నెత్తిమీదికి వచ్చింది. ఎర్రటి ఎండలో ఆగోరమైన శిక్షకు గురి అయిన ఆ బక్కప్రాణాలు ఆ ఎముకల గూళ్లు తట్టుకోలేక పోతువున్నారు. ఈ విషయం ఊరంతా పాకిపోయింది. వాళ్ల వాళ్ల ఆడవాళ్లు లబో - దిబో మంటు చావట్లో కొచ్చి ఎదలను బాదుకుంటు ఏడుస్తువున్నారు. గిర్‌దావర్ కాళ్లమీద, మాలిపటేలు కాళ్లమీద, పుల్లారెడ్డి పటేలు కాళ్లమీద పడి ఏడుస్తూ వున్నారు. వాళ్లు వెనక్కు వెనక్కు జరిగి 'అంటుకోవద్దు' అన్నట్టు ఈసడింపుగ చూస్తు పక్కకు

జరుగుతువున్నారు.

"ముండాకొడుకుల్లార మీతో లాభంలేదురా ఏదో బట్టలుతుకుతరు, చెప్పులు కుడతరు, బొచ్చు కొరుగుతరని సర్కారు ఇంత ఇనాం ఇస్తె చేసుకుంటువుంటిరి. రకం కడతలేరైతిరి ఎట్లా.భూమి కావాలి కాని రకాలు కట్టరు, లేవి కొలవరు" అన్నాడు.

" మాకు భూములొద్దు ఏమొద్దు, మీరెవుంచుకొండ్రి దొర. మామొగొల్ల వీపులమీది బండలుదింపియండ్రి మీకు దండం పెడతం " అన్నారు ఆడవాళ్లు.

' మరింకేమి ' అన్నట్టు చూశాడు మాలిపటేలు పోలీసు పటేలు పుల్లారెడ్డి వైపు చూసిండు.

పుల్లారెడ్డి గిర్దావర్ వైపు చూసిండు.

'హోనెదెవో' అన్నట్టు చూశాడు గిర్దావర్.

బండలను దించారు, చెమటలు కక్కిన శరీరాలు నేలమీద కూలబడ్డాయి. వాళ్ల వాళ్ల ఆడవాళ్లు వెళ్లి కొంగులతో ముఖాలు తూడ్చి బోరున ఏడుస్తువున్నారు.

కాగితాలు కదిలాయి. ఒక్కొక్కరే వేలిముద్రలు వేస్తువున్నారు ' బతికుంటె బల్సాకు తినొచ్చు' ఈ వూరు కాకపోతె ఇంకొకవూల్లో బతుకొచ్చు ' అని అంటున్నపుడు అది విన్న పటేలు " భూమిలేని ఊరులేదు భూమివుంటె శిస్తు వుంటది. పంటవుంటె లేవి వుంటది, ఇది ఓనాడు ఆగేది కాదు ఒకచోట లేనిది కాదు" అన్నాడు పటేలు.

"ఆగనీ, ఆగకపోని కూలి చేసుకొని బతుకుతం దొర. వంట్లో రక్తం లేనోల్లం ఈ బరువులు మోయలేం" అంది పెంటయ్య భార్య.

"భూములు వొదులుకున్నారు సరె. కట్టవల్సిన రకం మాత్రం కట్టక తప్పదు. కొంత గడువు యిస్తున్నాం అంతే" అని చెప్పి కుర్చిలోనుంచి లేచి నిలుచోని "చెలియే సాబ్, కానెకా వక్త్ హో గయా" అన్నాడు పుల్లారెడ్డి.

పన్నుల వసూలుకోసం గుర్రం మీద వచ్చిన గిరదావర్‌ను ఊరి మొదట్లోనే కలుసుకొని గుర్రాన్ని బేగరోన్ని కొట్టుకురమ్మనిచెప్పి.

'చెలియె' అన్నట్టు చూసిండు.

చుట్టు ఎత్తైన ప్రహారిగోడ బంగళా వచ్చిపోయె వాళ్ల కోసం ఓ హాలు. దాని పక్కమ్మటె స్నానాల గదులు వగైరా. దాని కానుకొని బంకుళ్లు. ఆ బంకుళ్లలోని కొత్త పాత జనం కలుసుకొని మాట్లాడుకోవడం. దానికెదురుగ వున్న వేపచెట్టుకింద పంచాయితుల పయిసలా జరుగుతూ వుంటాయి. గిర్దావర్, పటేల్ విశ్రాంతి గదులవైపు నడిచారు. అక్కడ పటువల్లో కల్లు పొంగుతుంది. డైనింగ్ టేబుల్ మీద వుంచిన సీసాల్లో సార గుమ్మున వాసనవొస్తు వుంది. ఆ పూట దాసిది దొరసాని పాత చీరె కట్టుకొని కొత్తగా కనిపిస్తుంది. ఆమె అన్ని తినుబండారాలను

సర్దుతు వుంది. ఆమె కాటుక కళ్ళు గిర్దావర్‌కు తన బేగంను మరిపించినయి. దాసిది గ్లాసులు నింపుతూవుంటె, వాళ్ళు ఖాళీ చేస్తూ వున్నారు. సీకులకు కుచ్చి కాల్చిన మాంసం ఒకదాని వెనుక ఒకటి అయిపోతువుంది. పటేలు సార తప్ప కల్లు ముట్టడం లేదు. అప్పుడు పటేలు తలవంచుకొని ఏదేదో ఆలోచిస్తున్నాడు. గిర్దావర్ వ్రాసిన దానిని తీసుకొని గదిలోకి నడిచాడు. పటేలు తన పడక గదిలోకి నడిచాడు. దొరసాని కిటికి దగ్గర నిలుచోని జరిగేదంత చూస్తూ నిలుచుని వుంది.

"ఏం చూస్తూ వున్నావు" అడిగాడు పటేలు కిటికి దగ్గరికొస్తూ.

"చూడకూడనిది" అంది వెటకారంగా

"ఇప్పుడు రాజ్యం వాళ్లదె, రాజరికం వాళ్లదే, వాళ్ళను కాదంటే మనకీ బతుకుండదు" అంటూ మంచంమీద వాలి పగటి నిద్రలోకి జారుకుండు.

వారం రోజుల కింద జరిగిన సంఘటన కళ్లముందు కదిలింది. అపును రాజ్యం వాళ్ళదే, రాక్షస రాజ్యం!

ఆ రోజు తన తల్లిగారి ఇంటి నుండి కచ్చడంలో వస్తూవుంది. కచ్చడం ముందు వెట్టివాడు చేతిలో బరిశతో పరుగెత్తుతున్నాడు. మధ్యలో ఓ చిట్టడవి వచ్చింది. ఆ అడవిలో అన్నీ మోదుగు పొదలూ బాటకు కొంత దూరంలో వున్న మోదుగు చెట్టుకు ఒకన్ని కట్టేయగ బాధతో మూల్గుతూ వున్నాడు. ఆ మూల్గుడు విన్న దొరసాని "ఆగు" అంది. ముందు వెట్టివాడు ఆ తరువాత కచ్చడం ఆగింది.

"ఓరేయి ఆ మూలుగేది ఎవరో చూడు" అంది దొరసాని.

వెట్టివాడు చూసి తిరిగొచ్చి

"ఆయన ముందల వచ్చే గూడెపు మనిషి. రజాకార్లు బాగ కొట్టి, చెట్టుకు కట్టేసి పోయింద్రట" అని బరిసెను రెండు చేతుల మధ్య పట్టుకొని వినయంగా చెప్పాడు. దొరసాని కచ్చడం పరదా పక్కకు అని ఆతన్ని చూసింది. అతను "దూప, దూప" అంటువున్నాడు. కచ్చడంలోని మరచెంబును కచ్చడంతోలె వానికిచ్చి 'నీళ్ళు తాపించి అతని కట్లు విడిచి తోలుకురా' అని కళ్లతోనె సైగ చేసింది. అతడు కట్లు విప్పగ నీళ్లు తాగి కాస్త తేరుకొని దొరసానికి దండంపెట్టి పక్క పొదవైపు వేలితో చూపించిండు.

'ఏమిటి అన్నట్టు' చూసింది దొరసాని అతని సైగ అర్థం కాక

"నా పెండ్లాం" అతి కష్టంగా చెప్పి బోరున ఏడిచిండు.

దొరసాని ఆ పొద దగ్గర్కి వెళ్లి చూసి నోటిమీద చేయి వేసుకొని, ఎవరు రావద్దు అని చెయ్యి సైగ చేసింది. తాను అటు వైపు నడువగా స్పృహ తప్పిన ఓ పాతికేండ్ల యువతి పడి వుంది. ఆమె చుట్టూర కాళ్ళు చేతులు కట్టుకున్న గుర్తులు. వంటి మీద నూలు పోగులేదు. రవికను చింపారు. చీరెను గుంజి చెట్టు కొమ్మ

మీద వేశారు. ఆమె ఒంటికంత ఇసుక అంటుకపోయింది.

దగ్గరికెళ్లి ముఖం మీద నీళ్ళు చల్లింది. ఆందోళనగా కదలగానె, అరచేతిని బుగ్గలకు ఆనించి ఓదార్చుతు చూసింది. ఆస్పర్శతో తన పక్కన వున్నది ఓ స్త్రీయే అని గ్రహించిన ఆమె కాస్త కదలి కళ్ళు తెరిచి చూసింది. ఆమెలో ఒణుకు తగ్గలేదు. దొరసాని మెడకింద చేయివుంచి లేపి నీళ్ళు తాపింది. తన వంటిని తాను తడిమి చూసుకోగా వల్లంతా వణికిపోతువుంది. దొరసాని చెట్టుమీద చినిగి వున్న చీరెను అందించి కట్టుకొమ్మని సైగ చేసింది.

ఒక్కసారె ఏడుస్తు తన చేతి నాలుగు వేళ్లను చూపించింది. అది చూసిన దొరసాని కళ్ళ నిండ నీరు తిరగగా మౌనంగా భర్త నిలుచున్న వైపు నడిచింది. అతన్ని కొట్టిన దెబ్బలు వంటిమీద దద్దులుగ లేచి వున్నాయి. కొన్ని చోట్ల రక్తం ఒరుస్తువుంది.

వీపున తుపాకితో గుద్దినట్లు గుర్తులు కనిపిస్తున్నయి.

దొరసాని బరువుగ నిట్టూర్చుతు "రజాకార్లెకదా" అని అడిగింది 'అవును' అన్నట్లు తలాడించాడు. 'ఈ రాక్షసులు ఎన్నడు నాశనమౌతరో' అనుకుంటూ కచ్చడం వైపు నడిచింది.

(కథ 1947 రజాకార్ల కాలం నాటి కథ)

● 2001